నల్లగండ్ల ఎస్సీ శ్మశానవాటికను అభివృద్ధి చేస్తా..



ఎమ్మెల్యే గాంధీని కలిసిన నల్లగండ్ల వాసులు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల ఎస్సీ శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తానని పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ తెలిపారు. శనివారం నల్లగండ్ల వాసులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. గాంధీ మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణం, బోర్, విద్యుత్ దీపాలు, బర్నింగ్ ప్లాట్‌ఫారం ఏర్పాటు ,వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, నల్లగండ్ల వాసులు రాజేంద్ర, ప్రభాకర్, డానియల్, చందర్ పాల్గొన్నారు.

30న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ డ్రై ఐ



కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ సి.జగదీశ్‌రెడ్డి

మాదాపూర్: వృద్ధులలో ప్రధానంగా కనిపించే డ్రై ఐ డిసీజ్ (కళ్లు పొడిబారడం) టెక్ నిపుణులు, టీనేజర్లలో ఎక్కువగా కనిపిస్తుందని డాక్టర్ సి. జగదీశ్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని రహేజా మైండ్‌స్పేస్ రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద ప్రిస్టిన్ ఐ ఆస్పత్రిలో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ సి.జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కళ్లు పొడిబారటం సమస్యపై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను (ప్రత్యేక కేంద్రాన్ని) ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈనెల 30వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ ప్రారంభిస్తారని తెలిపారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి



రాయదుర్గం: కార్గిల్ విజయదివాస్‌ను పురస్కరించుకొని నానక్‌రాంగూడలోని బీజేపీ డివిజన్ కార్యాలయంలో శనివారం అమరవీరులకు నివాళులు అర్పించారు. పార్టీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ ఆధ్వర్యంలో అమరవీరులను స్మరిస్తూ కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి వరలక్ష్మీదీరజ్, డివిజన్ ఉపాధ్యక్షుడు కిషన్, ప్రధాన కార్యదర్శి బబ్లూ సింగ్, కోశాధికారి ఉమేష్‌గౌడ్, నాయకులు ఉదయలక్ష్మీ, కవిత, సంకేష్‌సింగ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు లయన్స్ క్లబ్ చేయూత



చందానగర్: ఉన్నత విద్యలో రాణిస్తున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ చేయూతనందించింది. శనివారం చందానగర్‌లోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో హుడా కాలనీకి చెందిన బీటెక్ విద్యార్థిని మనీషాతో పాటు నలుగురు విద్యార్థులకు రూ.75వేల సాయం లయన్స్ క్లబ్ ఫర్ హోప్ అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు బర్క మల్లేష్, బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సాంబశివరావు, గాలి కృష్ణ, రెడ్డి ప్రవీణ్ రెడ్డి, సింగ దాసరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



ఆటోలోనే మృతి చెందిన వ్యక్తి

మాదాపూర్: ఆటోలో పడుకున్న వ్యక్తి గుండెపోటుతో మరణించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐకియా ఫ్లైఓవర్ కింద, పిల్లర్ నెంబర్ 9,10 మధ్యన ఆటో నిలిపివుంది. ఆటోడ్రైవర్ తలారి నాగేశ్వర్‌రావు (42) శుక్రవారం రాత్రి గుండెపోటు కారణంగా చనిపోయినట్టు పోలీసులు తెలిపారు. ఖమ్మంజిల్లా, సింగరేణి మండలం, పరుపెల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హైటెక్‌సిటీ ప్రాంతంలో బారులుదీరిన వాహనాలు

జడివాన.. ఇక్కట్లు



కొండాపూర్‌లో..

మూడు రోజులుగా వర్షం | రోడ్లపై వరద నీరు | రాకపోకలకు ఇబ్బందులు

జడివానతో జనం నానా ఇక్కట్లు పడుతున్నారు. ఇంట్లోంచి బయటకు వెళ్లాలంటే జంకే పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే చాలు రోడ్లపైకి వరద నీరు చేరుతుండడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, హఫీజ్ పేట్, మియాపూర్, మాదాపూర్, చందానగర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో ఇదే పరిస్థితి నెలకొంది. వర్షం ధాటికి రోడ్లు గుంతలుపడ్డాయి. వరద ధాటికి పలు చోట్ల గుంతలుపడ్డాయి. ఈ గుంతలలో నీరు నిలిచిపోతుండడంతో గుంతలు కనపడక వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు.

– శేరిలింగంపల్లి జోన్ బృందం



కాయిదమ్మకుంటలోకి చేరుతున్న వర్షపునీరు





డోయన్స్‌కాలనీలో ..



దీప్తిశ్రీనగర్ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



గుంతలు పడ్డ మాదాపూర్- చందానాయక్‌తండా రోడ్డు



బొటానికల్ గార్డెన్ రోడ్డు శ్రీరామ్‌నగర్ కాలనీకి వెళ్లే రోడ్డులో..



అన్నమయ్యపురంలో నృత్యార్చన



మాదాపూర్: మాదాపూర్ అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం నృత్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయినటరాజ నిలయం గురువు మాధురి మనోహర్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. గణేశ పంచరత్నాలు, మూషిక వాహన, నమోనమో లక్ష్మీనరసింహ, అదిగో అల్లదిగో శ్రీహరి వాసము ప్రదర్శించారు. కళాకారులు అలకనంద, యశ్విత, వర్షిత, ధీమాహి, ప్రతిష్ఠ, నేహా, దాక్షాయణి, వేదశ్రీ, అన్వేక్ష, స్నేహిత, దత్తధీమహి, శ్రీ మణిక, మేదస్వి, లక్ష్మిప్రియ, శాన్విశ్రీలు పాల్గొన్నారు. కళాకారులను సంస్థ వ్యవస్థాపకులు పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్‌లు కళాకారులను సత్కరించారు.

భారతదేశం పుణ్యభూమి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డా. సత్యప్రకాశ్ మహరాజ్

రాయదుర్గం: భారతదేశం పుణ్యభూమి అని, భారతమాత క్షేమంగా ఉంటేనే మనమంతా క్షేమంగా ఉంటామని ముంబాయి విశ్వకుటుంబ్ ధర్మ పరిషత్ స్వామి డాక్టర్ సత్యప్రకాశ్ సరస్వతి రుద్ర దాండి మహరాజ్ పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సనాతన చర్చ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశం సనాతన ధర్మం ఆచరించే ప్రాంతమన్నారు. మీ ప్రతి అడుగులో శాంతి ఉంటే ప్రతి కార్యం సఫలమవుతుందన్నారు. బ్రహ్మకుమారీస్ స్థానిక కేంద్రాల డైరెక్టర్ బికె కుల్‌దీప్ దీదీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి పరిఢవిల్లుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఎంఎస్‌ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ రాజేష్‌కుమార్, డా. జనార్దన్‌రెడ్డి, అంజలి, బి.కె.వంశీతో పాటు పలువురు బ్రహ్మకుమారీస్ సంస్థ, ముంబాయి విశ్వ కుటుంబ్ ధర్మ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య.. నష్టపరిహారం అందజేత



విద్యార్థి తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందిస్తున్న పాఠశాల యాజమాన్యం

చందానగర్: ఇటీవల హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో జనప్రియ అపార్ట్‌మెంట్స్ 5వ ఫేజ్ డి బ్లాక్‌లో నివాసముండే విద్యార్థి హన్సిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తెలిసిందే. ఈ ఘటన సెయింట్ మార్టిన్ స్కూల్ యాజమాన్యం వల్ల జరిగినట్లు బంధువులు, స్థానిక నాయకులు ఆరోపించారు. అయితే శనివారం బీఆర్ఎస్ యువ నాయకులు ధాత్రీనాథ్ గౌడ్, బీజేపీ నాయకులు బోయిని మహేష్ యాదవ్, వివిధ పార్టీల నాయకులు కలిసి పాఠశాల యాజమాన్యంతో చర్చించి నష్టపరిహారం కింద రూ.7 లక్షలు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. చర్చలో ఎంసీపీఐ నాయకులు పల్లె మురళీ, బీఆర్ఎస్‌వీ, ఎస్ఎఫ్ఐయూ నాయకులు, జనప్రియ డి బ్లాక్ ప్రతినిధులు ఉన్నారు.

కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

గచ్చిబౌలి: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను బొటానికల్ గార్డెన్ చౌరస్తాలో ఎన్ఎస్‌యూఐ నాయకులు దహనం చేశారు. సీఎంకు క్షమాపణలు చెప్పకపోతే కౌశిక్ రెడ్డి ఎక్కడ తిరిగినా అడ్డుకుంటామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామి హెచ్చరించారు. మరోసారి నిరాధారమైన ఆరోపణలు చేస్తే మా సత్తా ఏంటో చూపిస్తామని ఖబర్దార్ అని హెచ్చరించారు. కాగా ఎన్ఎస్‌యూఐ నాయకులు కౌశిక్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తారన్న సమాచారంతో కొండాపూర్‌లోని కొల్లగ్జారియా గేటెడ్ కమ్యూనిటీలో గచ్చిబౌలి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కౌశిక్ ఇంటికి బీఆర్ఎస్ శ్రేణులు

ఎన్ఎస్‌యూఐ నాయకులు ముట్టడికి వస్తున్నారని తెలియడంతో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. కొల్లగ్జారియాలోని కౌశిక్ నివాసం ఉండే విల్లాకు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో పాటు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు.



కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఉత్సాహంగా స్యాహి ఆర్ట్ అండ్ లిటరరీ ఫెస్ట్



మాదాపూర్: స్యాహి ఆర్ట్ అండ్ లిటరసీ ఫెస్ట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాదాపూర్‌లోని మెరీడియన్ స్కూల్‌లో శనివారం పరిచయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని సుమారు 55 పాఠశాలల నుంచి 4500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంప్రదాయ నృత్యాలతో పాటు కథలు చెప్పడం, చిత్రలేఖనం, గ్రాఫిటి, నుక్కడ్‌షో, మాల్గుడి షోస్ వంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మెరీడియన్ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు బుట్టా రేణుక, విద్యాసంస్థల సీఈఓ తేజస్వీ బుట్టా, అమోఘ్, విద్యాసంస్థల ప్రెసిడెంట్ లలితా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యశోద ఆస్పత్రిలో జాతీయ సదస్సు ప్రారంభం



జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న ఆస్పత్రి ఎండీ డాక్టర్ జి.ఎస్ రావు

మాదాపూర్: అన్నవాహిక, జీర్ణకోశ క్యాన్సర్ సర్జరీలపై యశోద ఆస్పత్రిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సదస్సును శనివారం హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జికల్ ఎక్స్‌లెన్స్ ద్వారా మాత్రమే కాకుండా వైద్య నిపుణులతో, అనుభవాలను పంచుకునే ఇలాంటి వేదికల ద్వారా కూడా రోగికి మెరుగైన ఫలితాలను అందించవచ్చన్నారు. ఈ సదస్సులో అన్నవాహిక, కడుపు క్యాన్సర్ సర్జరీలపై జూనియర్లకు వివరించారు.

28న నిధి ఆప్ కే నిఖత్ 2.0

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ సమస్యల పరిష్కారానికి ఈ నెల 28 న నిధి ఆప్‌కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాలుగు కేంద్రాల్లో శిబిరాలను ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. బొల్లారం పరిధిలోని ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో, పటాన్‌చెరు పరిధిలోని ఎ.ఆర్ జెల్ టైర్స్ లిమిటెడ్‌లో, చౌటకూర్ పరిధిలోని ఎంపీ డిస్టిలరీస్ లిమిటెడ్‌లో, శేరిలింగంపల్లి పరిధిలోని నానక్‌రాంగూడలో కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సెలేనియం టవర్-బిలో భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు ఈ 4 కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

మీనం చిత్ర ప్రదర్శన

మాదాపూర్: ప్రముఖ చిత్రకారుడు నున్నట రాజేశ్వర్ వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో మత్స్యకార వృత్తిపై మీనం చిత్రప్రదర్శనను నిర్వహిస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టంగుటూరి రాజేశ్‌ఖన్నా శనివారం తిలకించారు. నిరుపేద చిత్రకారులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గుర్తింపు ఇవ్వాలని కోరారు.





ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ఆహ్వానం

పటాన్‌చెరు: శ్రీ వేంకటేశ్వర భక్త బృందం తిరుమల పాదయాత్ర ఆహ్వాన పత్రికను నిర్వాహకుడు సీసల్ రాజు శనివారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి అందజేశారు. అలాగే ఎమ్మెల్సీ అంజిరెడ్డికి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరికి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... పాదయాత్ర 29వ తేదీ ఉదయం మహంకాళి అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమవుతుందని తెలిపారు.

ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్ట్

- ఐదుగురు రిమాండ్ మరో ఇద్దరు పరార్
- 17 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- కేసు వివరాలను వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్ కుమార్

మియాపూర్: ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ఐదుగురిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్దనుండి 17 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్, సీఐ శివప్రసాద్, డీఐ రమేష్ నాయుడు కేసు వివరాలను వెల్లడించారు. కామారెడ్డి బాన్సువాడకు చెందిన షేక్ సోహెల్(20) డ్రైవర్. అదే ప్రాంతానికి చెందిన షేక్ అహ్మద్(24), సల్మాన్ ఖాన్(20)తో పాటు మైనర్లు అయినా షేక్ ఆర్మాన్ చౌస్(17), ఆల్మాస్ షేక్ (17)తో పాటు మరో ఇరువురు సోహెల్ అలీ, కిస్మత్ అలీతో కలిసి కాలనీల్లో ఇళ్ల ముందు, ప్రధాన రోడ్ల పక్కన పార్క్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలను రాత్రిపూట దొంగిలించే వారు. బాన్సువాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసే వారు. ప్రధాన నిందితుడైనా షేక్ సోహెల్ పై కామారెడ్డి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆరు కేసులు నమోదు కాగా జైలుకు వెళ్లి వచ్చాడు. బాన్సువాడ ప్రాంతంలోని బాలురతో ముఠాగా ఏర్పడి సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలలో వాహనాల చోరీలకు పాల్పడుతున్నారు. వీరిపై మూడు కమిషనరేట్ పరిధుల్లో ఆసీఫ్‌నగర్, ఎల్బీనగర్, పటాన్‌చెరు, మియాపూర్, కేపీహెచ్‌బీ, చందానగర్, రామచంద్రాపురం, గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 10 కేసులు నమోదయ్యాయి.



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్ కుమార్

ఇలా పట్టుబడ్డారు..

మియాపూర్ మయూరినగర్‌కు చెందిన పుల్యాల ఉమా శంకర్ ఏప్రిల్ 5వ తేదీ ఇంటి ముందు రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనాన్ని పార్క చేశాడు. మరుసటి రోజు ఉదయం వాహనం కనిపించలేదు. దీంతో ఉమా శంకర్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా ప్రధాన నిందితుడు షేక్ సోహెల్, షేక్ అహ్మద్, సల్మాన్‌ఖాన్, షేక్ అర్మాన్ చౌస్, ఆల్మాస్ షేక్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్దనుండి 17 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు మైనర్లు షేక్ ఆర్మాన్ చౌస్, అల్మాస్ షేక్‌లను జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు.సోహెల్ అలీ(23), కిస్మత్ అలీ(22) పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు ఛేదించిన సీఐ శివ ప్రసాద్, డీఐ రమేష్ నాయుడు, ఎస్ఐ నర్సింహారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ప్రేమ్ కుమార్, యాదయ్య, కానిస్టేబుల్ చంద్రబోస్, మల్లికార్జున, పూర్ణచందర్, జగన్‌లను ఏసీపీ శ్రీనివాస్‌కుమార్ అభినందించారు.